www.prajanaava.in
Telugu Daily

# ప్రజానావ

ప్రతి అక్షరం జనం కోసం..

పేజీలు: 08 వెల : రూ.5.00

ప్రజానావ
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
తెలుగు రాష్ట్రాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న
ప్రజానావ దినపత్రికలో అతి తక్కువ ధరకే ప్రకటనలివ్వండి!
వివరాలకు ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
☎ : 99484 33277 / 7288825681

published from : Karimnagar, circulated to : Hyderabad, Karim nagar, Warangal, Khammam, Nalgonda, Mahabub nagar | హైదరాబాద్ | సంపుటి : 2 | సంచిక : 125 | బుధవారం | 16.10.2024

# పార్టీలు వేరైనా.. లక్ష్యం ఒక్కటే

## దేశాభివృద్ధే అందరి ధ్యేయం


- వీఎల్ఎఫ్ వల్ల ఎలాంటి చెడు ప్రభావం ఉండదు
- స్థానికులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయి
- కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్
- దేశ రక్షణ విషయంలో రాజకీయాలు చేయం
- వీఎల్ఎఫ్‌కు వ్యూహాత్మక ప్రాంతం వికారాబాద్ జిల్లా
- దేశ భద్రత ప్రాజెక్టులకు రాజకీయం చేయడం సరికాదు
- ఈ ప్రాజెక్టుకు గత ప్రభుత్వం అన్ని అనుమతులు ఇచ్చిందని వ్యాఖ్య
- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



**ప్రజానావ, హైదరాబాద్**

రక్షణరంగ పరికరాల తయారీలో హైదరాబాద్‌కు గొప్ప పేరుందని, పార్టీలు వేరైనా దేశాభివృద్ధిలో అందరూ కలిసి ముందుకెళ్లాలని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అన్నారు. వికారాబాద్ జిల్లా దామగుండం రిజర్వు ఫారెస్టులో రాడార్ స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన అనంతరం ఏర్పాటు చేసిన సభలో రక్షణ మంత్రి ప్రసంగించారు. అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా

మిగతా 2లో..



## సాఫ్ట్‌వేర్ యువతిపై ఆటో డ్రైవర్ అత్యాచారం

- గచ్చిబౌలిలో పీఎస్ పరిధిలో దారుణం
- పోలీసులకు ఫిర్యాదు చేసిన యువతి

05



## వయనాడ్ బరిలో ప్రియాంకా గాంధీ

- కాంగ్రెస్ అధిష్ఠానం ప్రకటన
- నవంబర్ 13న వయనాడ్ ఉప ఎన్నిక పోలింగ్

02



## అద్దె చెల్లించకపోవడంతో.. గురుకులాలకు తాళాలు

- రాష్ట్రవ్యాప్తంగా యాజమానులు నిర్ణయం
- తాళాలు వేయడంతో నిరాశకు గురైన విద్యార్థులు, టీచర్లు
- డిప్యూటీ సీఎం భట్టి హామీతో వెనక్కి తగ్గిన యాజమాన్యాలు
- అద్దెలు ఇంకెప్పుడు చెల్లిస్తారు? : హరీశ్‌రావు
- ట్వీట్ చేయడానికి సిగ్గు ఉండాలి : మంత్రి పొన్నం

**ప్రజానావ, ఖైరతాబాద్:**

రాష్ట్ర వ్యాప్తంగా అద్దె భవనాల్లో నడుస్తున్న గురుకుల పాఠశాలలకు యాజమాన్యాలు తాళాలు వేశారు. సుమారు 9 నెలలుగా ప్రభుత్వం అద్దె చెల్లించకపోవడాన్ని నిరసిస్తూ భవనాల యజమానులు మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల, హాస్టళ్లకు తాళాలు వేశారు. దీంతో దసరా సెలవుల అనంతరం పాఠశాలలకు వచ్చిన విద్యార్థులు, ఉపాధ్యాయులు బయటే ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. తుంగతుర్తి, బెల్లంపల్లి, తాండూరు, వరంగల్, భూపాలపల్లి, హుజూర్‌నగర్, భువనగిరిలోని రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్లకు భవన యజమానులు తాళాలు వేశారు. బకాయిలన్నీ వెంటనే చెల్లించాలని రాష్ట్ర గురుకుల విద్యాలయ ప్రైవేట్ భవన యజమానుల

మిగతా 2లో..

## విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడొద్దు

- ఎంతసేపు ఢిల్లీకి మూటలు పంపడమే మీ పనా?
- మాజీ మంత్రి కేటీఆర్ ఆగ్రహం
- నేడు పార్టీ నేతలతో కీలక సమావేశం
- హైడ్రా, మూసీ కార్యాచరణపై చర్చ?



02



## గ్రూప్1 పరీక్షలకు లైన్ క్లియర్

- ప్రిలిమ్స్‌పై దాఖలైన పిటిషన్లు కొట్టివేత
- రెండు పిటిషన్లను డిస్మిస్ చేసిన హైకోర్టు
- ఈ నెల 21 నుంచి యాథావిధిగా మెయిన్స్ ఎగ్జామ్స్

**ప్రజానావ,తెలంగాణ బ్యూరో :**

రాష్ట్రంలో గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షలకు లైన్ క్లియర్ అయ్యింది. గ్రూప్ 1 నోటిఫికేషన్లను సవాల్ చేస్తూ పలువురు దాఖలు చేసిన పిటిషన్లను హైకోర్టు కొట్టివేసింది. వీటితోపాటు ప్రిలిమ్స్‌పై దాఖలైన పిటిషన్లను కూడా హైకోర్టు కొట్టేసింది. దీంతో మెయిన్స్ పరీక్షలు యథావిధిగా అక్టోబర్ 21 నుంచి జరగనున్నాయి. గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్షపై

మిగతా 2లో..



02


## జీవో ఇచ్చింది కేసీఆరే..

- ఇప్పుడు పర్యావరణం గుర్తొచ్చిందా?
- రాడార్ స్టేషన్‌పై రాజకీయాలు చేయడం సరికాదు
- వీలైతే కేసీఆర్‌కు వ్యతిరేకంగా ఆందోళన చేయ్
- కేటీఆర్‌పై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆగ్రహం

## హైదరాబాద్‌లో భారీ వర్షం

- రోడ్లన్నీ జలమయం.. పలు చోట్ల భారీగా ట్రాఫిక్ జామ్
- మరో మూడ్రోజులు భారీ వర్షాలు
- వెల్లడించిన వాతావరణ శాఖ

02






## ఏపీకి వెళ్లాల్సిందే...

### ఐపీఎస్‌లకు క్యాట్ ఆదేశాలు

- సొంత రాష్ట్రంలో వెళ్లి రిపోర్ట్ చేయాలని సూచన
- ఐఏఎస్‌ల పిటిషన్లపై విచారణలో క్యాట్ ప్రశ్నాస్త్రాలు
- ఇంట్లో కూర్చొని సేవ చేస్తామంటే ఎలా అంటూ నిలదీత?
- హైకోర్టుకు ఐఏఎస్ అధికారులు..

**ప్రజానావ, హైదరాబాద్ :**

తమ కేడర్ రాష్ట్రానికి వెళ్లేందుకు వెనుకడుగు వేస్తున్న ఐఏఎస్ అధికారులకు ఎదురు దెబ్బ తగిలింది. తమను తెలంగాణలోనే కొనసాగించాలని చేసిన విజ్ఞప్తికి క్యాట్ ససేమిరా అని



## హిందువులు పిచ్చోళ్లు

02

- దర్గాలపై దాడి చేసేందుకు ధైర్యం లేదా?
- గుళ్లపై దాడులను ప్రభుత్వమే ప్రోత్సహిస్తుంది
- బీజేపీ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు



# హైదరాబాద్‌లో భారీ వర్షం

ప్రజానావ, హైదరాబాద్ :

నగరంలో మంగళవారం పలు చోట్ల భారీ వర్షం కురిసింది. జూబ్లీహిల్స్, అమీర్ పేట్, బంజారాహిల్స్, హైటెక్ సిటీ, పంజాగుట్ట, ఫిల్మ్ నగర్, ఖాజాగూడ, మెహిందీపట్నం, ఎస్ ఆర్ నగర్, దిల్ షుక్ నగర్, మలక్ పేట్, చాదర్ ఘాట్, ఎల్బీనగర్ తదితర ప్రాంతాల్లో వాన పడింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఈనేపథ్యంలో పెద్ద ఎత్తున ట్రాఫిక్ జామ్ అయ్యింది. భారీ వర్షంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కాగా, బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో తెలంగాణలో మూడు రోజుల వరకు భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నగరంలో నేడు కూడా వర్షం కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జీహెచ్ఎంసీ అధికారులు సూచించారు.



# విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడొద్దు

ప్రజానావ, ఖైరతాబాద్:

రాష్ట్ర వ్యాప్తంగా డిగ్రీ, పీజీ ప్రైవేట్ కాలేజీలను నిరవధికంగా మూసివేయడంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు చెల్లించకుండా పేద విద్యార్థులను చదువుకు దూరం చేస్తున్నారని ఫైరయ్యారు. "మూసీ కోసం రూ.లక్షా 50 వేల కోట్లు ఖర్చు చేసే కాంగ్రెస్ సర్కార్ దగ్గర అద్దె, ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు ఇవ్వటానికి పైసలు లేవా? రాష్ట్రానికి విద్యా శాఖ మంత్రి లేడు, ముఖ్యమంత్రికి విద్యారంగంలో సమస్యలను తెలుసుకునే ఓపిక లేదు. రాష్ట్రంలో విద్యార్థులు నష్టపోకుండా చర్యలు తీసుకోవాల్సిందిపోయి. ఎంతసేపు ఢిల్లీకి మూటలు పంపించే పనిలోనే ముఖ్యమంత్రి బిజీగా ఉన్నారు. లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో రేవంత్ సర్కార్ చెలగాటమాడుతోంది. ఢిల్లీకి మూటలు పంపించటంపై ఉన్న శ్రద్ధ, విద్యార్థులకు మేలు చేయటంలో లేదా? కాలేజీలు నిరవధికంగా బంద్ చేస్తామని హెచ్చరించినా, సర్కారుకు చీమ కుట్టినట్లైనా లేదా? వెంటనే రీయింబర్స్‌మెంట్ బకాయిలు, స్కాలర్‌షిప్‌లు చెల్లించాలి. విద్యార్థులకు అన్యాయం చేస్తామంటే బీఆర్ఎస్ సహించదు' అంటూ హెచ్చరించారు.

**నేడు కీలక సమావేశం..**

నేడు తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ పార్టీ కీలక సమావేశం జరగనుంది. జీహెచ్ఎంసీ పరిధిలోని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమావేశం కానున్నారు. హైడ్రా, మూసీ సుందరీకరణపై చర్చించే అవకాశం ఉంది. ఈ సందర్భంగా హైడ్రా, మూసీ సుందరీకరణ విషయంలో బీఆర్ఎస్ పార్టీ తమ కార్యాచరణను ప్రకటించే అవకాశం ఉన్నట్లు సమాచారం.

# పార్టీలు వేరైనా.. లక్ష్యం ఒక్కటే

(మొదటి పేజీ తరువాయి)



మంగళవారం వీఎల్ఎఫ్ స్టేషన్‌కు శంకుస్థాపన చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. ప్రాజెక్టుకు ఏర్పాటుకు అన్ని విధాలా అండగా నిలిచిన సీఎం రేవంత్‌రెడ్డికి అభినందనలు తెలిపారు. రక్షణరంగ పరికరాల తయారీలో హైదరాబాద్‌కు గొప్ప పేరుందని, దేశాభివృద్ధిలో తెలంగాణ పాత్ర కీలకంగా మారిందన్నారు. దేశ భద్రత విషయంలో వీఎల్ఎఫ్ పాత్ర కీలకమన్నారు. కమ్యూనికేషన్ విషయంలో ఈ కమాండ్ సెంటర్ ప్రముఖ పాత్ర పోషిస్తుందని రాజ్‌నాథ్‌సింగ్ తెలిపారు.

**ఇప్పుడంతా ఇంటర్నెట్ యుగం..**

"కమ్యూనికేషన్ విషయంలో భవిష్యత్తు దిశగా అడుగులు వేయాలి. సాంకేతికయుగంలో కమ్యూనికేషన్ అనేక రకాలుగా ఉపయోగపడుతుంది. కమ్యూనికేషన్ రంగంలో పావురాలు, గుర్రాల నుంచి ఇక్కడి వరకు వచ్చాం. తపాలా వ్యవస్థను అనేక ఏళ్లుగా వినియోగించుకున్నాం. ఇప్పుడంతా ఇంటర్నెట్ యుగం.. సమాచారం క్షణాల్లో చేరుతోంది. సమాచార విప్లవం.. ఇవాళ అనేక దేశాలను దగ్గర చేస్తోంది. విద్య, వైద్య రంగాల్లో కీలకపాత్ర పోషిస్తోంది. ఇంట్లో కూర్చునే అనేక కోర్సులు నేర్చుకునే అవకాశం వచ్చింది. వీఎల్ఎఫ్‌కు సహకరించిన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు. నావికారంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు కట్టుబడి ఉన్నాం. కమ్యూనికేషన్ వ్యవస్థను పటిష్ఠం చేసుకోవడం అనివార్యం. ఇండోపసిఫిక్ ప్రాంతంలో పుష్కలంగా ఖనిజ సంపద ఉంది. సముద్రంపై ఆధిపత్యం సాధించిన వాళ్లే మరింత అభివృద్ధి చెందుతారు. సముద్రంపై ఆధిపత్యం ఆంగ్లేయుల విస్తరణకు ఎంతో ఉపయోగపడింది. అత్యాధునిక పరికరాల ద్వారా రక్షణరంగాన్ని బలోపేతం చేస్తాం. దేశ రక్షణ విషయంలో ఎట్టిపరిస్థితుల్లోనూ రాజీ పడబోము. దేశ రక్షణ, భద్రత విషయంలో ఎలాంటి ఒత్తిళ్లు వచ్చినా వెనక్కి తగ్గం. వీఎల్ఎఫ్ వల్ల స్థానికులపై ఎలాంటి చెడు ప్రభావం ఉండదు. స్థానికులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయి" అని రాజ్‌నాథ్‌సింగ్ తెలిపారు.

**దేశ రక్షణలో రాజకీయాలొద్దు: రేవంత్‌రెడ్డి**

దేశ భద్రత విషయంలో హైదరాబాద్ వ్యూహాత్మక ప్రాంతమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. రాడార్ స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమంలో సీఎం పాల్గొని ప్రసంగించారు. "మన పార్టీలు వేరు కావొచ్చు.. సిద్ధాంతాలు వేరు కావొచ్చు. దేశ భద్రత, రక్షణ విషయంలో మేం ఎప్పుడూ మీతో కలిసి వస్తాం. దేశ రక్షణ పరికరాల తయారీలో హైదరాబాద్‌కు మంచి పేరుంది. వీఎల్ఎఫ్ ఏర్పాటుకు అత్యంత వ్యూహాత్మక ప్రాంతం వికారాబాద్ జిల్లా. కొందరు లేనిపోని ఆరోపణలు చేస్తూ వివాదాలకు తెరలేపుతున్నారు. దేశ భద్రత ప్రాజెక్టులకు రాజకీయం చేయడం సరికాదు. ఈ ప్రాజెక్టుకు బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని అనుమతులు ఇచ్చింది. దేశ రక్షణ విషయంలో రాజకీయాలు చేయనివ్వం" అని రేవంత్‌రెడ్డి అన్నారు.

# సాఫ్ట్‌వేర్ యువతిపై ఆటో డ్రైవర్ అత్యాచారం

ప్రజానావ, హైదరాబాద్ :





నగరంలో మరో దారుణ సంఘటన చోటు చేసుకుంది. గచ్చిబౌలిలో నుంచి ఆటోలో వెళ్తున్న ఓ ప్రైవేట్ సంస్థలో పనిచేస్తున్న యువతిపై అత్యాచారం చేశాడు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. గచ్చిబౌలిలోని ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్న యువతి రోజులాగే సోమవారం ఆఫీస్‌కి వెళ్లి అర్ధరాత్రి సమయంలో ఆటోలో వస్తుంది. ఈ క్రమంలో మసీదు బండ సమీపంలో ఆటోలోనే డ్రైవర్ యువతిపై అత్యాచారానికి పాల్పడినట్లు తెలుస్తోంది. ఈ ఘటన అనంతరం బాధిత యువతి గచ్చిబౌలి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడి కోసం గాలింపు చేపట్టారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

**ప్రభుత్వం సిగ్గుతో తలదించుకోవాల్సి పరిస్థితి : మాజీ హరీశ్‌రావు**

హై సెక్యూరిటీ ప్రాంతంగా చెప్పుకునే గచ్చిబౌలిలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగినిపై అత్యాచారం జరగడం ప్రభుత్వం సిగ్గుతో తలదించుకోవాల్సిన పరిస్థితి అని మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్ర విమర్శలు చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఎక్స్ వేదికగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగినిపై అత్యాచారం ఘటనపై స్పందించారు. కాంగ్రెస్ పాలనలో అత్యాచారాలు, హత్యలు నిత్యకృత్యం అయ్యాయని, నేరాల రేటు గణనీయంగా పెరిగిందని ఆరోపించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు రోజురోజుకు క్షీణిస్తున్నా ప్రభుత్వానికి కనీస పట్టింపు లేదన్నారు. హోంమంత్రిగా కూడా ఉన్న ముఖ్యమంత్రి ఒక్క నాడు సమీక్ష చేయడం లేదన్నారు. మహిళా భద్రతకు చిరునామాగా ఉన్న తెలంగాణలో ఇలాంటి ఘటనలు వరుసగా జరగడం ఆందోళనకరమన్నారు. అత్యాచార బాధితురాలికి భరోసా కల్పించాలని, నిందితులను గుర్తించి కఠిన శిక్ష పడేలా చేయాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా మహిళా భద్రత పట్ల ప్రత్యేక దృష్టి సారించాలని ప్రభుత్వాన్ని మరోసారి డిమాండ్ చేస్తున్నట్లు తెలంగాణ సీఎంఓ, డీజీపీని ఎక్స్‌లో ట్యాగ్ చేశారు.

# ఏపీకి వెళ్లాల్సిందే...

(మొదటి పేజీ తరువాయి)



చెప్పింది. వెంటనే ఆంధ్రప్రదేశ్‌లో బాధ్యతలు చేపట్టాలని స్పష్టం చేసింది. విచారణ సమయంలో ఐఏఎస్ అధికారుల తీరుపై క్యాట్ అసహనం వ్యక్తం చేసింది. ఏపీ కేడర్‌కు చెందిన వాకాటి కరుణ, వాణి ప్రసాద్, ఆమ్రపాలి, రోనాల్డ్ రోస్‌ను ఈనెల 16వ తేదీలోపు మీకు కేటాయించిన ఆంధ్రప్రదేశ్‌కు తిరిగి వెళ్లాలని డీఓపీటీ ఆదేశించిన విషయం తెలిసిందే. అయితే ఏపీకి వెళ్లేందుకు సమ్మతం లేని ఆ అధికారులు సోమవారం క్యాట్‌లో పిటిషన్ వేశారు. ఆ పిటిషన్‌పై మంగళవారం విచారణ చేపట్టిన క్యాట్ అధికారుల వైఖరిపై అసహనం వ్యక్తం చేసింది. బాధ్యతాయుతమైన అధికారులు ఇలా చేయడం సరికాదని పేర్కొంది. ఈ సందర్భంగా విచారణ హాట్‌హాట్‌గా కొనసాగింది.

**సేవ చేయాలని మీకు లేదా?..**

ఏపీలో వరదలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని.. వారికి సేవ చేయాలని మీకు లేదా? అంటూ ఐఏఎస్ అధికారులను క్యాట్ సూటిగా ప్రశ్నించారు. ఐఏఎస్‌ల కేటాయింపులపై డీవోపీటీకీ పూర్తి అధికారాలున్నాయంటూ స్పష్టం చేసింది ధర్మాసనం. స్థానికత ఉన్నప్పటికీ.. స్వాపింగ్ చేసుకునే అవకాశం గైడ్‌లైన్స్‌లో ఉందా? అని క్యాట్ ప్రశ్నించింది. అయితే, వన్ మెన్ కమిటీ సిఫారసులను డీవోపీటీ పట్టించుకోవడం లేదంటూ ఐఏఎస్ తరఫున న్యాయవాదులు వాదించారు. దీంతో వన్ మెన్ కమిటీ ఏర్పాటుపై వివరాలు అడిగింది క్యాట్. అదే సమయంలో 1986 బ్యాచ్ అధికారులతో స్వాపింగ్ ఎలా చేసుకుంటారంటూ ప్రశ్నించింది. ఇలా.. క్యాట్‌లో వాడి వేడి వాదనలు జరిగాయి. మరి క్యాట్ ఎలాంటి తీర్పు నిస్తుందనేది ఆసక్తికరంగా మారింది.

**మేం ఇక్కడే ఉంటామంటూ..**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన సందర్భంగా ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను తమ తమ క్యాడర్ కేటాయింపుల ప్రకారం ఏపీ, తెలంగాణకు కేటాయించారు. అయితే, ఇప్పుడు ఆ అధికారులు తమకు కేటాయించిన రాష్ట్రాలకు వెళ్లబోమంటున్నారు. ఏ రాష్ట్రానికి కేటాయించిన ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు.. ఆ రాష్ట్రానికి వెళ్లాలంటూ ఇటీవల కేంద్ర ప్రభుత్వం రిలీవింగ్ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే, ఆ ఉత్తర్వులను సవాల్ చేస్తూ పలువురు అధికారులు సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్(క్యాట్)ను ఆశ్రయించారు.

# జీవో ఇచ్చింది కేసీఆరే..

ప్రజానావ, ఖైరతాబాద్:



రాడార్ స్టేషన్ విషయంలో బీఆర్ఎస్ రెండు నాల్కుల ధోరణి వీడాలని సున్నితంగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి హెచ్చరించారు. వీలైతే కేసీఆర్‌కు వ్యతిరేకంగా ఆందోళన చేయాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వంలో రాడార్ ప్రాజెక్టుకు అనుమతులు ఇచ్చిన విషయాన్ని మరిచిపోయావా అంటూ ప్రశ్నించారు. పదేళ్లుగా ఎన్నో రకాలుగా అధికారులు వివరాలు ఇచ్చారని, శంకుస్థాపన సమయంలో రాజకీయ విమర్శలు చేయడం సరికాదన్నారు కేంద్రమంత్రి. ఆ ప్రాంతంలో ఉన్న రామలింగేశ్వర స్వామి దేవాలయానికి ఎవ్వరినీ వెళ్లనివ్వడం లేదన్న వార్తలపై రుసరుసలాడారు. గుడి విషయంలో అబద్ధాలు ప్రచారం చేయడం మానుకోవాలన్నారు. రాడార్ సెంటర్ ఏర్పాటుతో తెలంగాణకు గొప్ప పేరు వస్తుందన్న మంత్రి కిషన్‌రెడ్డి, 2,900 ఎకరాల్లో భూముల్లో 1500 ఎకరాల్లో ఎలాంటి నిర్మాణాలు ఉండవని వివరించారు. అలాంటప్పుడు చెట్లు నరికేస్తున్నారంటూ అబద్ధాలు ఎలా ప్రచారం చేస్తారని దుయ్యబట్టారు. పర్యావరణం పరిరక్షించడంలో భారత సైన్యం టాప్ లో ఉందన్నారు కేంద్రమంత్రి. ఈ విషయం మీకు తెలీదా? అంటూ ప్రశ్నల మీద ప్రశ్నలు సంధించారు. మిలటరీ క్యాంపుల్లో పచ్చదనానికి పెద్ద పీఠ వేస్తున్నారని, ఆ మాత్రం అవగాహన లేకుండా మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు.

# వయనాడ్ బరిలో ప్రియాంకా గాంధీ

న్యూఢిల్లీ:



మహారాష్ట్ర, ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికలతో పాటు 15 రాష్ట్రాల్లో రెండు లోక్‌సభ, 48 అసెంబ్లీ స్థానాల్లో ఉప ఎన్నికలకు ఈసీ మంగళవారం షెడ్యూల్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో కేరళలో ఒక లోక్‌సభ, రెండు అసెంబ్లీ స్థానాల్లో ఉప ఎన్నికకు కాంగ్రెస్ అభ్యర్థులను ప్రకటించింది. వయనాడ్ లోక్‌సభ స్థానం నుంచి కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీని బరిలో దించుతున్నట్లు ఆ పార్టీ అధికారికంగా ప్రకటించింది. పాలక్కడ్, చెలక్కార (ఎస్సీ) అసెంబ్లీ స్థానాలకు రాహుల్ మమ్‌కూటథిల్, రమ్య హరిదాస్ పేర్లను కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఎంపిక చేశారు. ఈ విషయాన్ని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ వెల్లడించారు.కాంగ్రెస్ తాజా నిర్ణయంతో ప్రియాంకా గాంధీ తొలిసారి ప్రత్యక్ష ఎన్నికల బరిలోకి దిగుతున్నట్లయింది. లోక్‌సభ ఎన్నికల్లో రెండు స్థానాల నుంచి గెలిచిన రాహుల్.. కీలకమైన ఉత్తర్ ప్రదేశ్‌లోని రాయ్‌బరేలీలోనే కొనసాగాలని గతంలో నిర్ణయం తీసుకున్నారు. ఈ క్రమంలో కేరళలోని వయనాడ్‌ను వదులుకోవడంతో అక్కడ ఉప ఎన్నిక అనివార్యమైంది. వయనాడ్ లోక్‌సభ సీటుతో పాటు రెండు అసెంబ్లీ స్థానాలకు నవంబర్ 13న పోలింగ్ జరగనుంది.




# గ్రూప్-1 పరీక్షలకు లైన్ క్లియర్

(మొదటి పేజీ తరువాయి)

ప్రిలిమ్స్‌లోని 7 ప్రశ్నలకు తుది 'కీ'లో సరైన జవాబులు ఇవ్వలేదని పిటిషనర్లు హైకోర్టును ఆశ్రయించారు. వాటికి మార్కులు కలిపి మళ్లీ కొత్త జాబితా ఇవ్వాలని పిటిషనర్లు కోరారు. ప్రిలిమ్స్‌కి, రిజర్వేషన్ల జీవో 33, తదితర అంశాలపై మొత్తంగా గ్రూప్ 1పై హైకోర్టులో 15కుపైగా కేసులు ఉన్నాయి. వీటన్నింటినీ మంగళవారం హైకోర్టు కొట్టివేసింది.

**మెయిన్స్ పరీక్షలు వాయిదా వేయాలని..**

ఇప్పటికే గ్రూప్ 1 మెయిన్స్ హాల్ టికెట్లు కూడా విడుదలయ్యాయి. పరీక్షల కోసం టీజీపీఎస్సీ వడివడిగా ఏర్పాట్లు చేస్తుంది. మెయిన్స్‌కు రాష్ట్ర వ్యాప్తంగా 31,382 మంది అభ్యర్థులు హాజరు కానున్నారు. మరోవైపు హైకోర్టు తీర్పు వల్ల తాము నిరాశకు గురయ్యామని పలువురు గ్రూప్1 అభ్యర్థులు అంటున్నారు. కోర్టు తీర్పుతో మానసికంగా కుంగిపోయామని, మెయిన్స్ ప్రిపరేషన్‌కు కొంత సమయం ఇవ్వాలని కోరుతున్నారు. అయితే ఇప్పటికే హాల్ టికెట్లు కూడా విడుదలవడంతో ఈ దశలో మెయిన్స్ పరీక్షలు వాయిదా వేయాలని అభ్యర్థులు కోరడం విశేషం. కమిషన్ ఎట్టి పరిస్థితిలోనూ పరీక్షలు నిర్వహించాలనే నిశ్చయించుకుంది. కోర్టు తీర్పు కూడా అనుకూలంగా రావడంతో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పకడ్బందీగా పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తుంది.

# హిందువులు పిచ్చోళ్లు



ప్రజానావ, హైదరాబాద్:

హిందువులు పిచ్చోళ్లు అని ఆర్మూర్ బీజేపీ ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. సికింద్రాబాద్ ముత్యాలమ్మ గుడిలో అమ్మవారి విగ్రహ ధ్వంసంపై రాకేశ్ రెడ్డి స్పందించారు. ఈ సందర్భంగా రాకేశ్ రెడ్డి మాట్లాడుతూ.. 'సిగ్గు, శరం లేని హిందువుల జాతి హైదరాబాద్‌లో పడి ఉంది. సిగ్గు, శరం, రక్తం ఈ కొడుకులకు ఎప్పుడు మరుగతదో..? రక్తం మరిగినప్పుడు ఈ సంఘటనలన్నీ తగ్గుతాయి. హిందువులు పిచ్చోళ్లు. హిందువులు చీము, నెత్తురు లేని నా కొడుకులు. హిందువుల్లో మగతనం చచ్చిపోయింది. మసీదులు, దర్గాల మీద దాడులు చేసేందుకు ఒక్క హిందువుకు కూడా ధైర్యం సరిపోవట్లేదా..? ఏ హిందూ పిచ్చోడు కూడా మసీదు మీదకు పోతలేడు. దాడులకు పాల్పడ్డ వారిని పిచ్చోళ్లు అని పోలీసులు వెనుకేసుకు వస్తున్నారు. ఈ దాడుల వెనుకాల ప్రభుత్వమే ఉంది.. దాడులను ప్రభుత్వమే ప్రోత్సహిస్తుంది' అని రాకేశ్ రెడ్డి పేర్కొన్నారు.

# అద్దె చెల్లించకపోవడంతో.. గురుకులాలకు తాళాలు

(మొదటి పేజీ తరువాయి)



సంఘం డిమాండ్ చేసింది. మా బాధను అర్థం చేసుకోవాలని అందులో పేర్కొన్నారు. గురుకుల పాఠశాలలు కొనసాగుతున్న ప్రైవేటు భవనాలకు వెంటనే అద్దె బకాయిలు విడుదల చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశించారు. అద్దె భవనాల యజమానులతో మాట్లాడి అన్ని సదుపాయాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా గురుకుల విద్యార్థులకు మెస్ ఛార్జీలను ఎప్పటికప్పుడు పెంచాలని ప్రభుత్వం నిర్ణయించినందున.. సంబంధిత అధికారులు సమావేశమై మెస్, కాస్మోటిక్స్, ట్యూటర్ల ఛార్జీల పెంపునకు చర్యలు తీసుకోవాలని చెప్పారు.

**అద్దెలు ఇంకెప్పుడు చెల్లిస్తారు: హరీశ్‌రావు**


గురుకులాలకు అద్దెలు ఇంకెప్పుడు చెల్లిస్తారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు ప్రశ్నించారు. 'ప్రభుత్వం 10 నెలలుగా అద్దె చెల్లించకపోవడంతో జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో యజమాని మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్ కు తాళం వేసిన దుస్థితి. కాంగ్రెస్ పాలనలో గురుకులాల నిర్వహణ అధ్వాన్న స్థితికి చేరుకున్నదనడానికి ఇది మరొక నిదర్శనం. ముఖ్యమంత్రి గారు.. గురుకులాలకు అద్దెలు ఇంకెప్పుడు చెల్లిస్తారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రోజు రోజుకి దిగజారి పోతున్న విద్యావ్యవస్థ గురించి విద్యాశాఖ మంత్రిగా కూడా ఉన్న మీరు.. ఇంకెప్పుడు పట్టించుకుంటారు?' అని ట్వీట్ చేశారు.

వారిపై క్రిమినల్ కేసులు పెట్టండి : పొన్నం..

అద్దె కోసం గురుకుల భవనాలకు తాళాలు వేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కలెక్టర్లను మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. మంగళవారం మంత్రి మీడియాకు వీడియో సందేశం రిలీజ్ చేశారు. భవనాల గేట్లకు తాళాలు వేసిన వారిపై కేసులు పెట్టాలని ఆదేశించామన్నారు. రాష్ట్రంలోని 70 శాతం గురుకులాలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయని తెలిపారు. కొన్నేళ్లుగా రాని బకాయిలను అడగలేక.. తమ ప్రభుత్వంపై ఒత్తిడి చేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. భవనాల అద్దెల గురించి సీఎం, డిప్యూటీ సీఎం వివరాలు తెప్పించుకున్నారని, నిధుల విడుదలపై బుధవారం సమావేశం కూడా ఏర్పాటు చేశారని తెలిపారు. నేడో, రేపో నిధులు విడుదల చేసే సమయంలో ఎవరో చెప్పిన మాటలు పట్టుకొని తాళాలు వేయొద్దని యజమానులను కోరుతున్నానని తెలిపారు. గురుకులాలకు ఏర్పాటు చేసిన బ్యానర్లు వెంటనే తొలగించాలన్నారు.

# ప్రమాదాల నివారణకు కాటమయ్య రక్షక కవచం

- ఆర్థిక ఇబ్బందులు ఉన్న ప్రజా సంక్షేమం, అభివృద్ధి కొనసాగింపు
- ఫ్యామిలీ డిజిటల్ కార్డుల ద్వారా అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు వర్తింపు
- గౌడ కులస్తులకు ఉపాధి కల్పన కోసం ఈత చెట్ల పెంపకానికి చర్యలు
- నూతన గ్రంథాలయ భవనంలో నిర్వహించిన కాటమయ్య రక్షక కవచ కిట్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వం విప్






**ప్రజానావ, వేములవాడ:**

తాటి చెట్ల పై నుంచి కల్లు తీసే గౌడ కార్మికుల ప్రమాదాల నివారణకు కాటమయ్య రక్షక కవచం కిట్ ఉపయోగపడుతున్నదని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వేములవాడ ఎంపీడీవో ప్రాంగణంలోని నూతన గ్రంధాలయ భవనంలో నిర్వహించిన కాటమయ్య రక్షక కవచ కిట్ల పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ లతో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, ఈత చెట్లు, తాడి చెట్లు జీవనాధారంగా కొనసాగుతున్న గౌడ సోదరులకు అవసరమైన సహాయం అందించేందుకు కాటమయ్య కిట్లను పంపిణి చేయడం జరుగుతుందని అన్నారు. కుల వృత్తులు చేస్తున్న సమయంలో జారి పడిపోయి ప్రమాదాల బారిన పడకుండా ఉండేందుకు రక్షణ కవచంగా నిలిచే కాటమయ్య రక్షణ కవచం కిట్లను అందిస్తున్నామని అన్నారు. గౌడ కులస్తులకు ఇప్పటికే పెన్షన్ అందిస్తున్నామని, ప్రమాదాలు జరిగితే పరిహారం సైతం అందిస్తున్నామని తెలిపారు.ప్రజా ప్రభుత్వం అధికారం చేపట్టే సమయానికి ఆర్థికంగా రాష్ట్ర చాలా దెబ్బతిందని, ప్రతి నెలా వచ్చే 18 వేల కోట్ల ఆదాయంలో 6 వేల కోట్ల అప్పుల వడ్డీలకే ఖర్చు అవుతుందని అన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమం అంశంలో వెనుకాడటం లేదని అన్నారు. ఆర్థిక లీకేజీలను, ఆడంబరాలను అరికడుతూ ప్రజల సంక్షేమం కోసం ఖర్చు చేస్తున్నామని అన్నారు. గల్ఫ్ కార్మికుల కోసం ప్రత్యేక పాలసీ ప్రవేశ పెట్టామని, 28 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఇంటిగ్రేటెడ్ విద్యా సంస్థల ఏర్పాటు చేస్తున్నామని, అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి కోసం ప్రభుత్వం కార్యక్రమాలు చేపట్టిందని అన్నారు. రేషన్ కార్డ్ స్థానంలో త్వరలోనే ఫ్యామిలీ కార్డు అందజేయడం జరుగుతుందని, ఆ కార్డు ద్వారా ప్రభుత్వం అందించే అన్ని పథకాలు అందుతాయని అన్నారు. ప్రతి రోజు ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం పని చేస్తుందని, ఇటీవల జరిగిన అసెంబ్లీలో కూడా ఉదయం ప్రారంభించి మరునాడు ఉదయం 3 గంటల వరకు ప్రజా సమస్యల మీద చర్చించడం జరిగిందని, ప్రజా సమస్యల పరిష్కారం పట్ల ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతకు ఇది నిదర్శనమని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం పై ఎవరైనా సూచన అందిస్తే దానిని ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. వేములవాడ దేవాలయం అభివృద్ధికి నిధులు తెచ్చుకున్నామని, అదేవిధంగా దశాబ్దాల కల వేములవాడలో నూలు యార్డ్ ఏర్పాటు చేసుకుంటున్నామని అన్నారు. ముంపు గ్రామాల ప్రజలకు ఉన్న ఇబ్బందుల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నమని అన్నారు. సామూహికంగా పెద్ద ఎత్తున ఈత చెట్లు పెంచే అవకాశాలను పరిశీలించి ఆ దిశగా చర్యలు చేపడతామని ప్రభుత్వ విప్ తెలిపారు. కాలువలకు ఇరు వైపులా ఈత చెట్లు నాటేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రయోగాత్మకంగా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 200 మంది గౌడ కార్మికులకు కాటమయ్య రక్షణ కవచ కిట్లను పంపిణీ చేస్తుందని, ఈ రోజు వేములవాడ, సిరిసిల్ల నియోజకవర్గాలలో ఎంపిక చేసిన 400 మంది లబ్ధిదారులకు రక్షక కిట్లను పంపిణీ చేస్తున్నామని అన్నారు. చెట్లపై నుంచి జారి పడటం ద్వారా వచ్చే వైకల్యంతో అనేక ఇబ్బందులు గీత కార్మికులు పడేవారని, ఈ రక్షక కిట్ ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని, దీని వినియోగం పై కార్మికులకు శిక్షణ సైతం అందించామని, దీనిని కార్మికులు తప్పనిసరిగా వినియోగించుకోవాలని, ప్రమాదాల నుంచి రక్షణ పొందాలని అన్నారు. కాటమయ్య రక్షక కవచ కిట్ల పంపిణీ కార్యక్రమం నిరంతర ప్రక్రియ, ప్రతి గీత కార్మికుడికి రక్షక కిట్ అందించే వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసి సంక్షేమ శాఖ అధికారి రాజ మనోహర్, అబ్కారీ శాఖ అధికారి పంచాక్షరీ, ప్రజా ప్రతినిధులు, లబ్దిదారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు. జిల్లా పౌర సంబంధాల అధికారి , రాజన్న సిరిసిల్ల చే జారీ చేయనైనది.



దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ దంపతులు కుటుంబ సమేతంగా సోమవారం శ్రీ రాజరాజేశ్వర స్వామిని దర్శించుకున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రధాన దేవాలయాల ఉద్యోగుల జేఏసీ చైర్మన్ గజవెల్లి రమేష్ బాబు ఆధ్వర్యంలో వేములవాడ దేవస్థాన యూనియన్ నాయకులు. ప్రధాన కార్యదర్శి కే శ్రీనివాస్, ఉద్యోగ సిబ్బంది మంత్రి దంపతులను శాలువాతో సత్కరించి స్వామి వారి చిత్రపటాన్ని అందజేశారు.




## బోన్ క్యాన్సర్ తో బాధపడుతున్న చిన్నారికి సాయం

**రూ. లక్ష 42 వేలు మంజూరు చేసిన కలెక్టర్ చెక్కు అందజేసిన ప్రభుత్వ విప్**

**ప్రజానావ, సిరిసిల్ల:**

సిరిసిల్లలోని గణేష్ నగర్ కు చెందిన కోడం హరికిషన్ కొడుకు కు బోన్ క్యాన్సర్ తో ఇబ్బంది పడుతున్నాడు. తమ కుమారుడిని ఆదుకోవాలని బాలుడి తండ్రి కలెక్టర్కు విన్నవించారు. దీంతో స్పందించిన కలెక్టర్ సందీప్ కుమార్ ఝా స్పందించి రూ.ఒక లక్ష 42 వేల చెక్కు మంజూరు చేయగా, ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ చేతుల మీదుగా బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.



## చెరువులో చేప పిల్లలు వదిలిన ముదిరాజ్ సంఘం నాయకులు

**ప్రజానావ, గన్నేరువరం:**

గన్నేరువరం మండలంలోని గనుకుల కొండాపూర్ లోని మైలారం కుంట చేరువులో మంగళవారం ముదిరాజ్ సంఘం నాయకులు 50 వేలు రూపాయల విలువ గల చేప పిల్లలను వదిలారు . కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు గూడేల్లి మల్లేశం, చొక్కల్ల కొండయ్య, బల్ల బలరాజ్, చోక్కల్ల నర్సయ్య, చోక్కల్ల బుచ్చయ్య, పాల్గొన్నారు.

# వారాస్ చెస్ ఫెస్టివల్ 2024ను ప్రారంభించిన మధుయాష్కీ గౌడ్



**ప్రజానావ, హైదరాబాద్:**

చెస్ క్రీడకు మంచి ఆదరణ పెరుగుతుందని, తెలంగాణ నుంచి కూడా క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తుండడం గొప్ప విషయమని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ పార్లమెంట్ సభ్యులు మధు యాష్కీ గౌడ్ గారు పేర్కొన్నారు. నగరంలోని బిర్లా ప్లాంటోరియం కాన్ఫరెన్స్ హాల్లో నేటి నుంచి ఈనెల 19దాకా, మరియు 20 న ఫైడ్ రేటేడ్ ర్యాపిడ్ మరియు నవంబర్ 24 వరకు అండర్ 1800 రేటింగ్ చెస్ టోర్నమెంట్ జరుగనుంది. "వారాస్ ఫస్ట్ ఇంటర్నేషనల్ ఫైడ్ రేటింగ్ చెస్ ఫెస్టివల్ 2024" ను మధుయాష్కీ గౌడ్ గారు ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. చెస్ ఫెస్టివల్ నిర్వహిస్తున్న వారస్ చెస్ అకాడమీ నిర్వాహకుడు రాఘవ్ శ్రీవత్సవ్ ను అభినందించారు. ఆయన మాట్లాడుతూ.. వివిధ దేశాల నుంచి చెస్ ఫెస్టివల్ కు క్రీడాకారులు హాజరు కావడం మంచి పరిణామమన్నారు. చెస్ ఆడడం ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత మరింత మెరుగవుతుందన్నారు. చెస్ క్రీడా వైపు విద్యార్థులను తమ తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. చెస్ ఫెస్టివల్ లో మంచి ప్రతిభ కనబరిచి అంతర్జాతీయ స్థాయిలో విద్యార్థులు స్థానాన్ని నిలబెట్టుకోవాలని పేర్కొన్నారు. వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డి గారు, ప్లాంటోరియం సెక్రటరీ శ్యాం కొటారి గారు, అడ్మిన్ గీత గారు, చెస్ ఫెస్టివల్ ఆర్బిటర్ ప్రమోద్ రాజ్ మోరే గారు, శ్యాంసుందర్ గారు పాల్గొన్నారు.

## జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఔత్సాహిక నిరుద్యోగ యువకులకు సువర్ణావకాశం



**ప్రజావావ, సిరిసిల్ల:**

సీసీటీవీ ఇన్స్టాలైజేషన్ , సాఫ్ట్ స్కిల్స్, బేసిక్ కంప్యూటర్ పై మూడు నెలల ఉచిత శిక్షణతో పాటుగా ఉపాధి అవకాశాలు. జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్., గారు.జిల్లాలో ఔత్సాహిక నిరుద్యోగ యువకులకు జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఉచిత భోజనం, వసతితో మూడు నెలల పాటుగా సీసీటీవీ ఇన్స్టాలైజేషన్ , సాఫ్ట్ స్కిల్స్, బేసిక్ కంప్యూటర్ పై ఉచిత శిక్షణ ఇచ్చి నైపుణ్యాలు పెంపొందించి హైదరాబాద్, కరీంనగర్, వరంగల్ వంటి నగరాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ గారు మంగళవారం రోజున ఒక ప్రకటన జారీ చేశారు.ఔత్సాహిక నిరుద్యోగ యువకులకు పదో తరగతి సర్టిఫికెట్ తో సంబంధిత పోలీస్ స్టేషన్లో ఈ రోజు నుండి 18.10.2024 రోజు సాయంత్రంలోగా పేరు నమోదు చేసుకోవాలని తెలిపారు.నిరుద్యోగ యువత ఈట్టి సువర్ణావకాశన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## చైర్మన్ కేడం లింగమూర్తిని సన్మానించిన గుంటి ఎల్లయ్య



**శాలువాలు కప్పి శుభాకాంక్షలు..**

**ప్రజానావ, చిగురుమామిడి:**

సిద్ధిపేట జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ గా నియామకం అయిన హుస్నాబాద్ కు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు,పిసిసి కార్యవర్గ సభ్యులు కేడం లింగమూర్తిని చిగురుమామిడి మండలం రామంచ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గుంటి ఎల్లయ్య మంగళవారం హుస్నాబాద్ లో మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గుంటి ఎల్లయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం హుస్నాబాద్ నియోజకవర్గంలో అహర్నిశలు కృషి చేసిన కేడం లింగమూర్తిని గుర్తించి సిద్దిపేట జిల్లా గ్రంధాలయాల సంస్థ చైర్మన్ గా నియమించడం పట్ల రాష్ట్ర రవాణా,బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కు ఎల్లయ్య ధన్యవాదాలు తెలిపారు.కాంగ్రెస్ పార్టీలో కష్టపడి,క్రమశిక్షణతో పని చేసిన కార్యకర్తలకు,నాయకులకు గుర్తింపు ఉంటుందని ఎల్లయ్య పేర్కొన్నారు.కేడం లింగమూర్తితో పాటు పార్టీ సీనియర్ నాయకులు చిత్తారి రవీందర్ ను,ఎండి హసన్ ను శాలువాలు కప్పి ఘనంగా సన్మానించినట్లు ఎల్లయ్య చెప్పారు.

# ఆర్థిక ఇబ్బందులున్నా ప్రజా సంక్షేమం, అభివృద్ధి కొనసాగింపు

- ఫ్యామిలీ డిజిటల్ కార్డుల ద్వారా అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు వర్తింపు
- గౌడ కులస్తులకు ఉపాధి కల్పన కోసం ఈత చెట్ల పెంపకానికి చర్యలు
- ఐ.డి. ఓ.సి. లో నిర్వహించిన కాటమయ్య రక్షక కవచ కిట్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వం విప్




**ప్రజానావ, సిరిసిల్ల:**

గత ప్రభుత్వాలు పాటించిన ఆర్థిక విధానాల వల్ల ప్రస్తుతం రాష్ట్రం ఆర్థికంగా కష్టాల్లో ఉన్నప్పటికీ ప్రజా ప్రభుత్వం ప్రజల సంక్షేమం అభివృద్ధిని కొనసాగిస్తుందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సమీకృత జిల్లా కలెక్టరేట్ లో సమావేశ మందిరంలో నిర్వహించిన కాటమయ్య రక్షక కవచ కిట్ల పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, నేడు 200 మంది గీత కార్మికులకు సిరిసిల్ల నియోజకవర్గంలో కాటమయ్య రక్షణ కిట్లను పంపిణీ చేస్తున్నామని అన్నారు. గీత కార్మికులు ఈత చెట్లు, తాడి చెట్లు ఎక్కి ప్రమాదాల వల్ల వైకల్యం పొందడం, ప్రాణాలు కోల్పోవడం జరుగుతుందని, దీనిని నివారించేందుకు సాంకేతికంగా ఒక కిట్ట్ ను తయారు చేసి, దానికి కాటమయ్య రక్షణ కిట్టు పేరుతో పంపిణీ చేస్తున్నామని అన్నారు. గతంలో సీఎం రేవంత్ రెడ్డి సిరిసిల్ల, వేములవాడ లో పర్యటించాల్సి ఉందని, ఢిల్లీలో వచ్చిన కార్యక్రమం వల్ల అప్పుడు సీఎం రావడం కుదరలేదని, వచ్చే నెలలో సీఎం రేవంత్ మన జిల్లాకు పర్యటించే అవకాశం ఉందని అన్నారు.గ్రామాలు కుల వృత్తులతో అభివృద్ధి సాధించాయని, గతంలో కూడా అనేక పేదలకు ఉపయోగపడే కార్యక్రమాలను తాము అమలు చేశామని అన్నారు. బియ్యం పంపిణీ నుంచి ఉచిత విద్యుత్తు, ఫీజు రియంబర్స్మెంట్, 108 వాహనాలు, ఆర్టిసి బస్సులలో ఉచిత ప్రయాణం, ఆరోగ్యశ్రీ పరిమితి పెంపు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు, గల్ఫ్ కార్మికుల కోసం ప్రత్యేక పాలసీ వంటి అనేక కార్యక్రమాలను అమలు చేశామని అన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారం చేపట్టే సమయానికి ఆర్థికంగా రాష్ట్ర చాలా దెబ్బతిందని, ప్రతి నెలా వచ్చే 18 వేల కోట్ల ఆదాయంలో 6 వేల కోట్ల అప్పుల వడ్డీలకే ఖర్చు అవుతుందని అన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమం అంశంలో వెనుకాడటం లేదని అన్నారు. ఆర్థిక లీకేజీలను, ఆడంబరాలను అరికడుతూ ప్రజల సంక్షేమం కోసం ఖర్చు చేస్తున్నామని అన్నారు.గీత కార్మికులు అధికంగా ఉన్న ప్రాంతాల్లో ప్రభుత్వ భూములలో సామూహికంగా పెద్ద ఎత్తున ఈత చెట్లు పెంచే అవకాశాలను పరిశీలించి ఆ దిశగా చర్యలు చేపడతామని ప్రభుత్వ విప్ తెలిపారు. కాలువలకు ఇరు వైపులా ఈత చెట్లు నాటేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రత్యేక డ్రైవ్ ద్వారా ఈత, తాటి చెట్లను పెంచాలని అన్నారు.జిల్లా గ్రంథాలయం సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ, ప్రభుత్వం అందించిన కాటమయ్య రక్షక కవచ కిట్లను వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గోనడం చాలా సంతోషమని అన్నారు. గతంలో అనేక ప్రమాదాలు జరిగేవని, వాటిని నివారించేందుకు ప్రభుత్వం సేఫ్టీ పరికరాలను అందించడం చాలా సంతోషకరమని అన్నారు. ప్రతి గీత కార్మికుడికి రక్షక కిట్ లు చేరాలని, దీనిని వారు పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని తెలిపారు.

సిరిసిల్ల మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ స్వరూప రాణి మాట్లాడుతూ, తన చిన్నతనంలో తాటి చెట్టు పై నుంచి గీత కార్మికుడు ప్రమాదానికి గురై మరణించడం గమనించానని, భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు ఎక్కడా జరగకుండా ప్రభుత్వం భావించి అందిస్తున్న కాటమయ్య రక్షక కవచ కిట్ల పంపిణీ చేస్తుందని దీనిని పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని అన్నారు.జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ సిరిసిల్ల నియోజకవర్గాలలో 200 మంది ఎంపిక చేసిన లబ్ధిదారులకు రక్షక కిట్లను పంపిణీ చేస్తున్నామని అన్నారు. ఈ రక్షక కిట్ ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని, దీని వినియోగం పై కార్మికులకు శిక్షణ సైతం అందించామని, దీనిని కార్మికులు తప్పనిసరిగా వినియోగించుకోవాలని, ప్రమాదాల నుంచి రక్షణ పొందాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, బీ.సి సంక్షేమ శాఖ అధికారి రాజ మనోహర్, అబ్కారీ శాఖ అధికారి పంచాక్షరీ, ప్రజా ప్రతినిధులు, లబ్దిదారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..



# డీఎస్సీ కౌన్సెలింగ్ యథాతథం

**ప్రజానావ, హైదరాబాద్ :**

రాష్ట్రంలో డీఎస్సీ 2024 ద్వారా ఉపాధ్యాయ నియామక పత్రాలు అందుకున్న 10,006 మంది కొత్త టీచర్లకు పోస్టింగులు ఇస్తున్నారు. సాంకేతిక సమస్యలతో ఉదయం కౌన్సెలింగ్ ప్రక్రియ వాయిదా వేసినట్లు ప్రకటించారు. సాంకేతిక నిపుణులు సమస్యను పరిష్కరించడంతో తిరిగి కౌన్సిలింగ్ నిర్వహించేందుకు పాఠశాల విద్యాశాఖ అనుమతినిచ్చింది. అయితే ఉదయం డీఎస్సీ ఉపాధ్యాయ పోస్టులకు కౌన్సిలింగ్ వాయిదా వేస్తున్నట్లు విద్యాశాఖ ప్రకటన చేసింది. జిల్లాలకు సంబంధించిన డేటా ఇంకా పూర్తిస్థాయిలో రాకపోవడంతో ప్రస్తుతానికి కౌన్సిలింగ్ వాయిదా వేసినట్టు తెలిపారు. డేటా వచ్చిన వెంటనే కొత్త తేదీలు ప్రకటిస్తామన్నారు. ఒకట్రెండు రోజుల్లోనే ప్రకటన ఉంటుందని అంటున్నారు.

**ఆందోళనకు గురైన అభ్యర్థులు..**

షెడ్యూల్ ప్రకారం మంగళవారం ఉదయమే కౌన్సెలింగ్ ప్రక్రియ జరగాలి. అయితే సాంకేతిక సమస్య ఏర్పడటంతో కౌన్సిలింగ్ వాయిదా వేశామని అధికారులు చెప్పడంతో అభ్యర్థులు ఆందోళనకు గురయ్యారు. ఒక్కరోజు ముందు కౌన్సిలింగ్ ఉందని సమాచారం ఇచ్చి ఉదయమే వాయిదా వేయడంతో అవాక్కయ్యారు. కౌన్సిలింగ్ కోసం దూర ప్రాంతాల నుంచి వచ్చిన మహిళల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. ముందస్తు సమాచారం లేకుండా ఉన్నఫలంగా వాయిదా వేయడం అనుమానాలకు తావిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

# దామగుండం జీవో ఇచ్చిందే బీఆర్ఎస్

### ఇప్పుడు మొసలి కన్నీరు కార్చడం కాదు
### బీజేపీది గాడ్సే సిద్ధాంతం..
### కాంగ్రెస్‌ది గాంధీ సిద్ధాంతం
### మంత్రులతో ముఖాముఖిలో సీతక్క



**ప్రజానావ, ఖైరతాబాద్:**

దామగుండం ప్రాజెక్టుకు జీవో ఇచ్చిందే గత బీఆర్ఎస్ ప్రభుత్వమంటూ మంత్రి సీతక్క మండిపడ్డారు. మంగళవారం గాంధీ భవన్‌లో మంత్రులతో ముఖా ముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సమస్యల గురించి మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్లారు. సమయం తక్కువగా ఉండటంతో నేరుగా ప్రజలు, పార్టీ శ్రేణుల వద్దకే వెళ్లి దరఖాస్తులను స్వీకరించారు. తమ భూములు లాక్కున్నారని, తమ గ్రామంలో కొత్త అంగన్వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, ఇందిరమ్మ కమిటీల్లో కాంగ్రెస్ కార్యకర్తలకే అవకాశం కల్పించాలని, ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని, కబ్జాలకు గురైన తమ భూములు తనకే దక్కిలా చూడాలని, తమ డబ్బులు తిరిగి ఇప్పించాలని, 98 డీఎస్సీ అభ్యర్థులకు టీచర్ ఉద్యోగాలు కల్పించాలని, అవినీతి ఆరోపణలు ఉన్న పలువురు ప్రభుత్వ అధికారులను తొలగించాలని మంత్రి సీతక్కకు వినతి పత్రాల ద్వారా ప్రజలు నివేదించారు. ఆ వినతి పత్రాలను స్వీకరించిన మంత్రి సీతక్క పలువురు జిల్లా కలెక్టర్లు, సంబంధిత శాఖ ఉన్నతాధికారులకు ఫోన్లో మాట్లాడి ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ 'భూమికి సంబంధించిన పలు సమస్యలు నా దృష్టికి వచ్చాయి. వికలాంగులు పెన్షన్ కోసం వచ్చారు. అన్ని వినతులు తీసుకున్నాం.. వాటిని పరిశీలించి త్వరలోనే పరిష్కరిస్తాం. దామగుండం ప్రాజెక్టుకు జీవో ఇచ్చింది గత బీఆర్ఎస్ ప్రభుత్వమే. అధికారంలో ఉన్నప్పుడు ఒకలా , ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరోలా మాట్లాడటం సరైంది కాదు. బీఆర్ఎస్ మొసలి కన్నీరు కారుస్తుంది. బీజేపీది గాడ్సే సిద్ధాంతం.. కాంగ్రెస్ ది గాంధీ సిద్ధాంతం.. రెండు ఎప్పటికీ ఒక్కటి కావు' అంటూ మంత్రి సీతక్క వ్యాఖ్యానించారు.



## కేంద్ర మంత్రిని కలిసిన ఎంపీ ఈటల

**ప్రజానావ, మేడ్చల్:**

కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ కట్టర్‌ను మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ ఢిల్లీలో మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. హర్యానాలో హ్యాట్రిక్ విజయం సాధించినందుకు ఆయనకు అభినందనలు తెలిపారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద ఎక్కువ గృహాలను కేటాయించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. హైదరాబాదులో చెరువులు మురికికూపాలుగా మారిపోయాయని, వాటిని పరిశుభ్రం చేయడానికి కావాల్సిన నిధులు కేటాయించాలని ఆయన కోరారు. స్వచ్ఛభారత్ కింద ఎక్కువ నిధులను కేటాయించాలని, హైదరాబాదులో ఉన్న పరిశ్రమల నుంచి ఎక్కువ మొత్తంలో సీఎస్ఆర్ నిధులను మల్కాజ్‌గిరి నియోజకవర్గానికి కేటాయించేలా చూడాలని ఈటల కోరారు. జయం సాధించినందుకు ఆయనకు అభినందనలు తెలిపారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద ఎక్కువ గృహాలను కేటాయించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. హైదరాబాదులో చెరువులు మురికికూపాలుగా మారిపోయాయని, వాటిని పరిశుభ్రం చేయడానికి కావాల్సిన నిధులు కేటాయించాలని ఆయన కోరారు. స్వచ్ఛభారత్ కింద ఎక్కువ నిధులను కేటాయించాలని, హైదరాబాదులో ఉన్న పరిశ్రమల నుంచి ఎక్కువ మొత్తంలో సీఎస్ఆర్ నిధులను మల్కాజ్‌గిరి నియోజకవర్గానికి కేటాయించేలా చూడాలని ఈటల కోరారు.

# అర్హులకు న్యాయం చేసేందుకే 'ఇందిరమ్మ కమిటీలు'





**ప్రజానావ, శామీర్‌పేటః:**

సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రజలకు చేరేందుకే ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. మంగళవారం శామీర్‌పేట మండలం తూంకుంటలోని మొగుళ్ళ వెంకట్‌రెడ్డి ఫంక్షన్ హాల్‌లో తూంకుంట మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, శామీర్‌పేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్‌గౌడ్ అధ్యక్షతన కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇందిరమ్మ కమిటీల ఏర్పాటుకు శామీర్‌పేట, మూడుచింతలపల్లి మండలాల, తూంకుంట మున్సిపల్, జవహర్‌నగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ ముఖ్యనాయకులతో అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యతిథిగా మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వజ్రేష్ యాదవ్ విచ్చేసి మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు మేడ్చల్ నియోజకవర్గంలోని మున్సిపాలిటీల్లో, గ్రామాల్లో వినూత్నంగా ఇందిరమ్మ కమిటీలను రాజకీయాల కతీతంగా, పారదర్శకంగా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఏర్పాటు చేసిన ఇందిరమ్మ కమిటీలు ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న వివిధ పథకాలకు అర్హులైన వారిని ఎంపిక చేసి వారికి దక్కేలా చేయడమే ప్రభుత్వ ఆశయమన్నారు. ఏలాంటి పొరపాట్లకు, అవకతవకలకు తావివ్వకుండా ఇందిరమ్మ కమిటీలతో ప్రభుత్వ పథకాలు అమలయ్యేలా ప్రభుత్వం తగు చర్యలను తీసుకుంటుందని చెప్పారు. డీసీసీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ గైడ్లెన్స్ ప్రకారం విలైనంతత్వరగా మున్సిపాలిటీల్లో, గ్రామాల్లో ప్రజాప్రతినిధులకు, మాజీ ప్రజాప్రతినిధులకు, కాంగ్రెస్ పార్టీ ముఖ్యనాయకులకు ప్రాధాన్యతనిచ్చి పారదర్శకంగా ఇందిరమ్మ కమిటీలను పూర్తి చేయనున్నట్లు తెలిపారు. మున్సిపాలిటీల్లో, గ్రామాల్లో ఎలాంటి గొడవలకు, ఆవకతవకలకు తావివ్వకుండా సామరస్యంగా ఇందిరమ్మ కమిటీలను వేయాలని పార్టీ నాయకులకు సూచించారు. ప్రభుత్వ పథకాలను అర్హులైన వారికి దక్కేలా పకడ్బందీగా అమలు చేయడానికే ఇందిరమ్మ కమిటీలను ప్రభుత్వ పరంగా వేస్తున్నట్లు వివరించారు. ప్రభుత్వ పథకాల అమలులో అవకతవకులు జరుగకుండా ఇందిరమ్మ కమిటీల ఆధ్వర్యంలో అర్హులైన ప్రజలకు అందజేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ జడ్పీటీసీ బాలేష్, శామీర్ పేట మండల అధ్యక్షుడు వై. శంకర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి తుంకి రమేష్, మూడుచింతలపల్లి మండలాల కాంగ్రెస్ నాయకులు, తూంకుంట మున్సిపల్, జవహర్ నగర్ కార్పోషన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, పార్టీ కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, పార్టీ మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఇది దొరల పాలన కాదు.. ప్రజా పాలన

### అధికారులు అది మర్చిపోవద్దు
### మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**ప్రజానావ, మణుగూరు:**

భద్రాద్రి జిల్లాలోని మణుగూరులో జరిగిన సమీక్షలో పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ అధికారులు దొరల పాలనలో ఉన్నామనేది మర్చిపోండి. ప్రజా పాలనలో ఉన్నాం. దొరల పాలనలో ఉన్నామనుకుంటే ఈ ప్రభుత్వం ఉపేక్షించదన్నారు. రాష్ట్రంలో 1251 నియోజకవర్గాల్లో కార్పోరేటర్ల తలతన్నెల ఇంటిగ్రేటెడ్ పాఠశాల శంకుస్థాపనలు చేశామని, అర్హులైన రైతులకు రెండు లక్షల వరకు రుణమాఫీ చేస్తామని చెప్పామన్నారు. గత ప్రభుత్వం గడిచిన 10 సంవత్సరాలలో 13,500 కోట్లు రెండు విడుదలగా చేస్తే ఈ ప్రభుత్వం 26 రోజుల్లో 18 వేల కోట్లు రుణమాఫీ చేసిందని, ఇంకా 13 వేల కోట్లు రుణమాఫీ చేయాలని అనేక వేదికల మీద చెప్పామని ఆయన వ్యాఖ్యానించారు. ఈ ప్రభుత్వం మాట ఇస్తే మాట తప్పదు. అన్న మాట ప్రకారం రాబోయే రోజుల్లో 13 వేల కోట్ల రుణమాఫీ చేస్తామని ప్రజలకు చెప్పాల్సిన బాధ్యత అధికారులకు ఉందని, వరద బాధితులకు 16,500 ఇంటికి, ఎకరానికి 10,500 ఈ ప్రభుత్వం ఇచ్చిందన్నారు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి. అంతే కాకుండా.'భద్రాద్రి వొచ్చిన వరదల్లో జిల్లా యంత్రాంగం ప్రజలతో మమేకమై పనిచేసింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున కృతజ్ఞతలు. వర్షాకాలం పూర్తి అయ్యేలోపు రాష్ట్రంలో ఏడుగురు సభ్యులతో కూడిన కమిటీ ఆధ్వర్యంలో 4,000 తగ్గకుండా మొదటి విడతలో ఇంద్రమ్మ ఇల్లు కట్టిస్తాం. గత ప్రభుత్వ ఆలోచనలో ఉంటే అధికారులు పద్ధతులు మార్చుకోవాలి. ఈ ప్రభుత్వానికి అనుగుణంగా పనిచేయాలి. గత ప్రభుత్వం సీతారామ ప్రాజెక్టు పేరుతో పేదోడి సొమ్ము కొల్లగొట్టి దాచుకున్నారు ప్రాజెక్టు అసంతృప్తిగా వదిలేశారు. పినపాక నియోజక వర్గంలో పులుసు వంతు ప్రాజెక్టును పూర్తి చేయడానికి ఈ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉంది. గత ప్రభుత్వంలో నిర్లక్ష్యాన్ని గురైన లిఫ్టులను పునరుద్ధించి 15 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తాం. గిరిజన ప్రాంతంలో వైద్యానికి ఈ ప్రభుత్వం పెద్దపీడ వేస్తుంది.' అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు.

# కన్నుల పండువగా రేణుకఎల్లమ్మ కళ్యాణం



**ప్రజానావ, శామీర్‌పేట:**

శ్రీ రేణుక ఎల్లమ్మ కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మండల కేంద్రం శామీర్‌పేటలో మంగళవారం గౌడ సంఘం ఆధ్వర్యంలో శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయంలో 7వ వార్షికోత్సవంలో భాగంగా అమ్మవారి కళ్యాణోత్సవాన్ని కన్నుల పండువగా దేశం కుటుంబ సభ్యులు, గౌడ సంఘం ఆధ్వర్యంలో జరిపారు. ఈ కళ్యాణోత్సవంలో భాగంగా ఉదయం అమ్మవారికి ఘటం తీసుకువెళ్లారు. అనంతరం భక్తుల కోలాహలం మధ్య అమ్మ వారి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. అమ్మవారికి సూర్య భవనం సమర్పించారు. ఈ సందర్భంగా శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయానికి త్రిశక్తి పీఠం శ్రీశక్త్యానందగిరి స్వామి, ఎమ్మెల్యే మల్లారెడ్డి, వివిధ పార్టీల నాయకులు, భక్తులు విచ్చేసి ఎల్లమ్మ అమ్మవారును అత్యంత భక్తి శ్రద్ధలతో దర్శించుకుని ప్రత్యేక పూజలను చేశారు. ఈ సందర్భంగా ఎల్లమ్మ ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యే మల్లారెడ్డి, మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వజ్రేష్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహులుయాదవ్, మాజీ జడ్పిటీసీ అనితలాలయ్యలను గౌడ సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. అనంతరం శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయంలో వార్షికోత్సవం సందర్భంగా గౌడ సంఘం వారు భక్తులకు అన్నదానం చేశారు.

# శాంతియుత వాతావరణంలో జీవించాలి

### రాయపోల్ ఏఎస్ఐ దేవయ్య



**ప్రజానావ, దౌల్తాబాద్:**

భిన్నత్వంలో ఏకత్వం భారతదేశ నినాదమని దేశ సాంస్కృతి సాంప్రదాయాలు కాపాడటానికి ప్రతి ఒక్కరం బాధ్యత వహించాలని రాయపోల్ ఏఎస్ఐ దేవయ్య అన్నారు. మంగళవారం రాయపోల్ మండల కేంద్రం పోలీస్ స్టేషన్‌లో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులమత బేధాలు లేకుండా పండగలు ప్రశాంతమైన వాతావరణంలో ఎలాంటి అసాంఘిక చర్యలకు తావులేకుండా సాంప్రదాయ బద్ధంగా అన్ని మతాల పండగలు జరుపుకోవాలన్నారు. వినాయక చవితి దుర్గామాత ఉత్సవాలకు మండపాల వద్ద డీజే సౌండ్ ఏర్పాటు చేస్తున్నారని డీజేలకు అనుమతి లేదన్నారు. డీజే పెట్టడం వల్ల శబ్ద కాలుష్యం అవుతుందని ఇతరులకు ఇబ్బందికరంగా ఉంటుందన్నారు. గ్రామాలలో పండుగలు ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో సాంప్రదాయ పద్ధతిలో నిర్వహించుకోవాలన్నారు. ఇతరులను కించపరిచేటువంటి పాటలు, ప్రదర్శనలు చేయకూడదన్నారు. మండపాల వద్ద ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో ఎలాంటి సమస్యలు ఉన్న శాంతియుతంగా పెద్దమనుషుల సమక్షంలో పరిష్కరించుకోవాలని లేనియెడల పోలీసులను సంప్రదించాలన్నారు. అంతే తప్ప చట్టాన్ని చేతిలోకి తీసుకొని ఎవరు ఇష్టానుసారంగా వారు ప్రవర్తించరాదన్నారు. శాంతి భద్రతలు కాపాడటంలో ప్రజలు పోలీసులకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు వెంకటేశ్వర శర్మ, నాయకులు జీవన్‌రెడ్డి, ఇసాక్, కాంగ్రెస్ నాయకులు కిష్టారెడ్డి, సాజిద్ తదితరులు పాల్గొన్నారు.

# ధరణి పెండింగ్ దరఖాస్తులు త్వరగా పరిష్కరించండి

## లక్ష్యాలను పెట్టుకుని పనిచేయాలి

### జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్





**ప్రజానావ, మెదక్:**

ధరణి పెండింగ్ దరఖాస్తులపై తహశీల్దార్‌లతో మంగళవారం మెదక్ జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ సమీక్ష నిర్వహించారు. పెండింగ్ ధరణి దరఖాస్తుల పరిష్కారానికి తీసుకున్న చర్యలపై మండలాల వారీగా తహశీల్దార్‌లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రికార్డులు పరిశీలించి క్షేత్ర స్థాయిలో విచారణ చేసిన తర్వాత సంబంధిత దరఖాస్తుల ఆన్‌లైన్‌లో అప్డేట్ చేసి పరిష్కరించాలన్నారు. జిల్లాలో పెండెగ్‌లో 3000 ధరణి దరఖాస్తులు ఉన్నాయన్నారు. వాటిని 30 జూన్ వరకు పెండింగ్ ధరణి దరఖాస్తులు కలెక్టరేట్ సూపరిండెంట్‌తో సమన్వయం చేసుకొని ముగించాలన్నారు. ఈ దరఖాస్తులకు ముగింపుకు వారం గడువు తేదీ ఇస్తున్నట్లు తెలిపారు. జెన్యూన్ పట్టాదారు విషయంలో తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. ఇనాం కేసులో విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డేటా కరెక్షన్ దరఖాస్తులు క్షేత్రస్థాయి విచారణ చేపట్టి పరిష్కరించాలన్నారు. మ్యూటేషన్ వంటి దరఖాస్తులను రికార్డులు పరిశీలించి వెంటనే పరిష్కరించాలన్నారు. గ్రామ స్థాయి పెరిగిన రీ సెటిల్మెంట్ రికార్డ్(ఆర్ఎస్ఆర్) విషయంలో కాస్రా, సంబంధిత బేస్ రికార్డ్ ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. ధరణి దరఖాస్తులను తిరస్కరించిన పక్షంలో అందుకు స్పష్టమైన కారణాలు, సంబంధిత ఆధారిత డాక్యుమెంట్లు స్పష్టంగా అప్‌లోడ్ చేయాలని, అలా చేయడం వల్ల ప్రజలకు ఎందుకు దరఖాస్తు తిరస్కరించారనేది అర్థమవుతుందన్నారు. కొన్ని సమస్యలు తహశీల్దార్ స్థాయిలో, మరికొన్ని సమస్యలు రెవెన్యూ డివిజన్ అధికారి స్థాయిలో, మరికొన్ని సమస్యలు కలెక్టర్ స్థాయిలో ఉన్న దరఖాస్తులపై పక్కా ప్రణాళికతో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ వివరించారు. ఈ సమావేశంలో జిల్లాలోని అన్ని మండలాల తహశీల్దార్‌లు తదితరులు పాల్గొన్నారు.

## ఓటరుగా నమోదు చేసుకోవాలి



**ప్రజానావ, నార్సింగి:**

ఉపాధ్యాయులు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఫార్మ్ 19లో దరఖాస్తు చేసుకోవాలని ఉపాధ్యాయ సంఘాల వారు కోరారు. కరీంనగర్ ఉపాధ్యాయ, గ్రాడ్యుయేషన్ శాసన మండలి ఎన్నికల సందర్భంగా మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయుల ఓటరు నమోదు కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాలైన తపస్, పీఆర్టీయూ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల, శేరిపల్లి పాఠశాల ఉపాధ్యాయులతో నమోదు చేయించారు. శాసన మండలి ఓటు కోసం ఉపాధ్యాయులు ఫార్మ్ 19లో తప్పకుండా నమోదు చేసుకోవాలని కోరారు. ఎన్నికల్లో సరైన అభ్యర్థులను ఎన్నుకోవాలని, ఉపాధ్యాయ సంఘాల ద్వారా బలపరిచిన అభ్యర్థిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నార్సింగి తపస్ అధ్యక్షుడు తీగుళ్ళ స్వామి, నార్సింగి మండల పీఆర్టీయూ అధ్యక్షుడు గడ్డం అశోక్, ప్రధాన కార్యదర్శి రాజు, లింగం, రాష్ట్ర కార్యదర్శి లింగ ప్రసాద్, రాష్ట్ర ముఖ్య బాధ్యులు వేంకటేశ్వర శర్మ, రామకృష్ణ, వెంకటేశం, కిషన్, దీపా, పల్లవి తదితరులు పాల్గొన్నారు.

## అన్నారంలో బీజేపీ సభ్యత్వ నమోదు



**ప్రజానావ, జిన్నారం:**

గుమ్మడిదల మండలం అన్నారం గ్రామంలో భారతీయ జనతా పార్టీ క్రియాశీలక సభ్యత్వం డ్రైవ్ కార్యక్రమాన్ని బీజేపీ గుమ్మడిదల మండల వైస్ ప్రెసిడెంట్ కావలి ఐలేష్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యతిథిగా బీజేపీ పార్టీ సంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు ప్రతాప్‌రెడ్డి, జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు అంజిరెడ్డి, గుమ్మడిదల మండల బీజేపీ ప్రెసిడెంట్ పలుగు గోవర్ధన్‌రెడ్డి హాజరై ఈ కార్యక్రమాన్ని కొనసాగించారు. వీరు ప్రజలకు కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న పథకాల గురించి వివరించి సభ్యత్వం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఓబీసీ ఉపాధ్యక్షులు ఉదయ్ కుమార్, గుమ్మడిదల మండలం మహిళా మోర్చా అధ్యక్షురాలు సారా సృజనలక్ష్మి, పార్టీ సీనియర్ నాయకులు, బూత్ అధ్యక్షులు అరవింద్‌రెడ్డి, కుమ్మరి భాగయ, రాజు, పాపారావు, బాలరాజు పాల్గొన్నారు.

## పరువు పోయిందని మహిళ ఆత్మహత్య




**ప్రజానావ, చిన్నశంకరంపేట:**

ఓ వ్యక్తి ఇంట్లోకి వచ్చి అసభ్యకరంగా మాట్లాడగా, తన పరువు పోయిందనీ మనస్థాపానికి గురైన ఓ వివాహిత ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన చిన్న శంకరంపేట మండల కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్ఐ నారాయణగౌడ్ కథనం ప్రకారం చిన్నశంకరంపేటకు చెందిన విభూతి యాదమ్మ (40) ఈ నెల 13వ తేదీన తన ఇంటి వద్ద ఉండగా, మాల్తుమ్ దుర్గయ్య అనే వ్యక్తి యాదమ్మ అసభ్యంగా ప్రవర్తించడంతో తన పరువు పోయిందని తీవ్ర మనస్థాపానికి గురైంది. ఈ నేపథ్యంలోనే మంగళవారం ఉదయం తన గుడిసెలో చీరతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మాల్తుం రాములు కారణంగానే తన తల్లి చనిపోయినదని మృతురాలి కొడుకు శ్రీను పోలీసులకు ఫిర్యాదు చేశాడు ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# నేరాల నియంత్రణలో నిఘా నేత్రాలు కీలకం

## గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి



**ప్రజానావ, దౌల్తాబాద్:**

కులాల మతాల గురించి తగువులు పెట్టుకొని అభివృద్ధిని ఆడ్డుకోవద్దని, శాంతి భద్రతలు సక్రమంగా ఉన్నప్పుడే అభివృద్ధి ముందుకెళ్తుందని గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి అన్నారు. మంగళవారం దౌల్తాబాద్ మండల కేంద్రంలో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతి మతం కులం వర్గం అనే బేధాలు లేకుండా అందరూ కలిసిమెలిసిగా ఉండడం చాలా ముఖ్యమన్నారు. గ్రామాల్లో మండల కేంద్రంలో అనుకోకుండా అకస్మాత్తుగా ఆవేశంతో ఏదైనా సంఘటన జరిగినప్పుడు వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్ కు సమాచారం అందించాలన్నారు. ఈ మధ్యకాలంలో ఏ చిన్న సంఘటన జరిగినా చాలామంది సోషల్ మీడియాల ద్వారా వైరల్ అవుతుందన్నారు. అలాంటి పరిణామాలు సమాజానికి మంచిదికాదన్నారు. అన్ని మతాలను కులాలను గౌరవించుకుంటూ సమాజంలో ముందుకు వెళ్లడం చాలా ముఖ్యమన్నారు. యువతతో తల్లి దండ్రులు పెద్దలు మానవ సంబంధాలు కలిగి ఉండాలని తెలిపారు. యువత ఆలోచన పెంచుకోవాలి ఆవేశాన్ని తగ్గించుకోలన్నారు. ఆలోచన విధానం మంచిగా ఉంటే మంచి ఆలోచనలు వస్తాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ అభివృద్ధి సంక్షేమం గురించి పాటుపడాలన్నారు.



## దేవుడున్నాడని మర్చిపోవద్దు

### తోట సీఐ లతీఫ్

శాంతియుత భావనతోనే జీవించినప్పుడు మానవత్వానికి భారత దేశ సంస్కృతి ప్రపంచానికి దిక్సూచి అని సీఐ లతీఫ్ అన్నారు. ప్రతి వ్యక్తి పట్టుదలతో పైకి రావాలని తపన ఉండాలన్నారు. సనాతన ధర్మం అనేది జీవన విధానాన్ని చూపిస్తుంది తప్ప మతతత్వం కాదన్నారు. ఈ విషయాన్ని ప్రతి హిందూ ముస్లిం క్రైస్తవ సిక్కు పార్శ మొదలగు మత పెద్దలు గమనించాలన్నారు. వారి బోధనలను దేశ భవిష్యత్తు కోసం ఉపయోగించుకోవల తప్ప వ్యక్తిగత స్వార్థాలకు ఉపయోగించినట్లయితే వారిపై పోలీస్ శాఖ కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు రహీముద్దీన్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు పడాల రాములు, బీజేపీ మండల అధ్యక్షులు భూపాల్‌రెడ్డి, వివిధ పార్టీల నాయకులు మద్దెల స్వామి, లాలు, కర్నాల శ్రీనివాస్, ఆది వేణు తదితరులు పాల్గొన్నారు.

# తాగునీటికి శాశ్వత పరిష్కారం

## మాజీ సర్పంచ్ ఆది వేణుగోపాల్

**ప్రజానావ, దౌల్తాబాద్:**

దౌల్తాబాద్ మండల కేంద్రంలో ప్రజల నీటి ఎద్దడిని అరికట్టడానికి సొంత నిధులతో బోరు వేయించామని దౌల్తాబాద్ మాజీ సర్పంచ్ ఆది వేణుగోపాల్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దౌల్తాబాద్ మండల కేంద్రంలోని ముదిరాజ్, రజకుల కాలనీలో నీటి ఎద్దడి ప్రజలు నీళ్ల రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని, ప్రజల ఇబ్బంది తెలుసుకొని సొంత నిధులతో బోరు వేయించి ప్రజలకు నీటి కష్టాలు లేకుండా చేయడం కోసం తనవంతు బాధ్యతగా కృషి చేశానన్నారు. ప్రజా సేవ చేయడానికి పదవులే ముఖ్యం కాదని, పదవి ఉన్న లేకున్నా ప్రజలకు సేవ చేయడానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలు, యువకులు పాల్గొన్నారు.



# ఓటర్ నమోదు కార్యక్రమం ప్రారంభం

**ప్రజానావ, మెదక్:**

కరీంనగర్, మెదక్ అదిలాబాద్, నిజామాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్ నమోదు కార్యక్రమాన్ని మంగళవారం హవేలీ ఘనపూర్ మండలం కుచన్‌పల్లి, బూరుగుపల్లి రాజుపేట్ గ్రామాల్లో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పీఆర్టీయూటీఎస్ హవేలీ ఘనపూర్ మండల శాఖ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు మల్లారెడ్డి, మండల అధ్యక్షులు సుభాశ్‌రెడ్డి, కార్యదర్శి నరేందర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓటు హక్కు కలిగిన ప్రతి ఉపాధ్యాయులు తమ పేరును ఓటర్ లిస్టులో నమోదు చేసుకోవాలన్నారు. పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర శాఖ అధికారికంగా బలపరిచిన వంగ మహేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పీఆర్టీయూ రాష్ట్ర, జిల్లా బాధ్యులు త్యార్ల శ్రీనివాస్, రాజేందర్‌రెడ్డి, శివరాజు, సంతోష్‌కుమారి, సుకన్య, కొండల్‌రెడ్డి, ఎల్లం, రాజు, కృష్ణవేణి, సందీప్, కృష్ణ, పంతంగి శ్రీనివాస్, గంగమని తదితరులు పాల్గొన్నారు.

# పారదర్శకంగా ఉపాధ్యాయుల కౌన్సెలింగ్

## జిల్లా విద్యాశాఖ అధికారి రాధాకృష్ణ



**ప్రజానావ, మెదక్:**

కౌన్సెలింగ్ ప్రక్రియ ద్వారా 269 ఉపాధ్యాయులకు పోస్టింగ్స్ ఉత్తర్వులు జారీ చేశామని జిల్లా విద్యాశాఖ అధికారి రాధాకృష్ణ తెలిపారు. మంగళవారం మెదక్ కలెక్టరేట్‌లో డీఎస్సీ 2024 నియామకల్లో భాగంగా మెదక్ జిల్లా నుండి ఎంపిక కాబడిన ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహించి వివిధ పాఠశాలల్లో పోస్టింగ్స్ ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాలను పాటిస్తూ కౌన్సెలింగ్ ప్రక్రియ చేపట్టామని, మొత్తం 272 మంది ఉపాధ్యాయులు ఎంపిక కాగా ముగ్గురు పోస్టింగ్ అనివార్య కారణాలవల్ల పక్కన పెట్టడం జరిగిందన్నారు. మొత్తం 269 వివిధ కేటగిరీలో కౌన్సెలింగ్ ద్వారా పోస్టింగ్ కేటాయించడం జరిగిందన్నారు. నూతనంగా ఉపాధ్యాయ వృత్తిని చేపట్టే ఉపాధ్యాయులు జిల్లా విద్యాశాఖ అధికారి రాధాకృష్ణ పలు సూచనలు చేస్తూ విద్యార్థులకు నాణ్యమైన గుణాత్మక విద్యను బోధించడంతో పాటు భావి భారత పౌరులుగా తీర్చిదిద్ది ఉత్తమ ఉపాధ్యాయులుగా పాఠశాలకు పేరు ప్రఖ్యాతులుగా తీసుకురావాలని ఆకాంక్షించారు.

# రాష్ట్ర ఫిషర్‌మెన్ కమిటీ చైర్మన్‌కు సన్మానం



**ప్రజానావ, నార్సింగి:**

రాష్ట్ర ఫిషర్‌మెన్ కమిటీ చైర్మన్ మెట్టు సాయికుమార్‌కు మండల ఫిషెర్‌మెన్ కమిటీ చైర్మన్ సుధాకర్ ఆధ్వర్యంలో మండల కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. మంగళవారం మెట్టు సాయికుమార్ జాతీయ రహదారి 44 గుండా నిజామాబాద్‌లో జరిగే కార్యక్రమంలో పాల్గొనడానికి వెళ్తున్న సందర్భంగా నార్సింగి మండల కేంద్రంలోని కాంగ్రెస్ నాయకులను కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా మండల ఫిషర్‌మెన్ అధ్యక్షుడు సుధాకర్, నాయకులు మండల పరిసర చెరువుల సమస్యల పరిష్కారం, చేప పిల్లల పంపకం గురించి విజ్ఞప్తి చేశారు. సానుకూలంగా స్పందించిన మెట్టు సాయి కుమార్ వీలైనంత త్వరగా చేప పిల్లల పంపకం చేస్తానని, ఏవైనా సమస్యలున్నా తప్పకుండా పరిష్కరిస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్‌గౌడ్, పీసీసీ సేవా దళ్ రాష్ట్ర కార్యదర్శి యాదగిరి యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ రాజేందర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడు బాచి స్వామి, నాయకులు రాజేష్, స్వామి, మైనారిటీ నాయకులు బాఖర్, ప్రభాకర్ పాల్గొన్నారు.

# బలగం వేణుకు హీరో దొరికేసినట్టే..?




హాస్య నటుడిగా ఇండస్ట్రీలో అడుగుపెట్టి బలగం సినిమాతో దర్శకుడిగా మారి తోలి ప్రయత్నంలోనే సూపర్ హిట్ కొట్టాడు వేణు. 2023 లో విడుదలైన ఈ సినిమా సూపర్ హిట్ గా నిలిచింది. అటు ప్రశంసలతో పాటు నిర్మాతలకు కాసుల వర్షం కురిపించింది బలగం. వేణు ఈ చిత్రానికి గాను జాతీయ అవార్డు సైతం అందుకున్నాడు. ఇదిలా ఉండగా ఈ సినిమా రిలీజ్ అయి ఏడాది దాటినా కూడా ఇప్పటికి మరో సినిమా మొదలెట్టలేదు వేణు. బలగం సినిమాను నిర్మించిన దిల్ రాజు బ్యానర్ లోనే రెండవ సినిమా కూడా చేయాల్సి ఉంది. రెండవ సినిమా కోసం చాలా కాలం కిందటే ఓ కథ రెడీ చేసుకున్నాడు వేణు. ఆ కథను అందరి చుట్టూ తిరుగుతుంది కానీ ఎక్కడ ఫైనల్ కావట్లేదు. ముందుగా ఈ కథను నేచురల్ స్టార్ నాని కి వినిపించారు. కానీ సెకండ్ హాఫ్ పట్ల నాని సంతృప్తి చెందలేదు సో అక్కడ ఒకే అవ్వలేదు. అటు నుండి మరొక యంగ్ హీరో తేజ సజ్జా వద్దకు వచ్చి చేరింది. ఇక్కడ దాదాపు ఒకే అని కూడా వార్తలు వచ్చాయి. కానీ అక్కడ కూడా కార్యరూపం దాల్చలేదు. ఇక ఫైనల్ గా యంగ్ హీరో నితిన్ దగ్గరకు వచ్చి చేరింది. నితిన్ కూడా వేణు ఒక నేరేషన్ ఇచ్చాడని తెలుస్తోంది. ఇక్కడ కూడా సేమ్ సీన్ రిపీట్, కానీ ఆల్మోస్ట్ నితిన్ ఒకే చెప్పాడని కొన్ని కరెక్షన్స్ చెప్పాడని సమాచారం. అన్ని కుదిరితే నితిన్ తోనే ఈ సినిమా పట్టాలెక్కుతుందని టాక్ నడుస్తోంది. ఈ కథకు నిర్మాత దిల్ రాజు ఇప్పటికే యల్లమ్మ అనే టైటిల్ ను రిజిస్టర్ చేసి ఉంచారు.



# ఆ ఇంట్లో ఏదో శక్తి ఉంది

హీరోయిన్ ఆదా శర్మ.. దివంగత హీరో సుశాంత్ ఇల్లును కొనుగోలు చేసింది. రీసెంట్ గానే తన కుటుంబంతో ఆ ఇంట్లోకి షిఫ్ట్ అయ్యింది. అయితే పలువురు పబ్లిసిటీ కోసమే ఆదా ఇలా చేసిందంటూ నెట్టింట వార్తలు గుప్పుమన్నాయి.తాజాగా ఆదా శర్మ ఈ వార్తలపై స్పందించి.. ఈ విధంగా రూమర్స్ క్రియేట్ చేసేవారిని అసలు పట్టించుకోనని తెలిపింది. అలాగే నటిగా తనకు ఎన్నో పనులు ఉంటాయని చెప్పింది. తాను మంచి పర్సన్ ను అని ఇతరులకు తెలియజేయాల్సిన అవసరం ఆమెకు లేదని, ఇల్లు కొనాలనిపించింది కొన్నానని వెల్లడించింది. ఎవరికోసం తన పద్ధతి మార్చుకోనని తెలిపింది. అలాగే సుశాంత్ ఇల్లు ఆదా శర్మకు బాగా నచ్చిందని, ఏదో తెలియని శక్తి ఉందని పేర్కొంది.తన అమ్మమ్మతో కలిసి సుశాంత్ ఇంట్లోనే ఉంటున్నానని, ఇంట్లోకి రాగానే చాలా పాజిటివ్ గా అనిపించిందని తెలిపింది. ఇంటిని రీమోడలింగ్ చేశానని, ఫస్ట్ ఫ్లోర్ ను టెంపుల్‌లా తీర్చిదిద్దానని వివరించింది. అంతేకాకుండా ఒక రూమ్ ను డ్యాన్స్ కోసం.. మరో గదిని మ్యూజిక్ కోసం.. స్టూడియోగా చేశానని వెల్లడించింది. ఇక టెర్రస్ అయితే మొత్తం గార్డెన్‌లాగా మార్చేసినట్లు చెప్పుకొచ్చింది.

# మీ అభిమానమే నన్ను ఈ స్థాయికి చేర్చింది

తన కొత్త సినిమా 'దేవర పార్ట్ 1'కు దక్కిన ఆదరణపై నటుడు ఎన్టీఆర్ ఆనందం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టారు. చిత్రాన్ని విజయవంతం చేసిన ప్రేక్షకులు, అభిమానులు తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. 'దేవర పార్ట్ 1'పై మీరు చూపిన ఆదరణకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు. ఈ సినిమా ఎప్పటికీ నా హృదయంలో ప్రత్యేక స్థానం కలిగి ఉంటుంది. నా సహనటులు సైఫ్ అలీఖాన్, జాన్వీ కపూర్, ప్రకాశ్ రాజ్, శ్రీకాంత్ తదితరులు తమ పాత్రలకు ప్రాణం పోశారు. దర్శకుడు కొరటాల శివ దిశానిర్దేశంతోనే ఈ ప్రాజెక్టు విజయవంతమైంది. నిర్మాతలు సుధాకర్ మిక్కిలినేని, హరికృష్ణ కొసరాజు, సంగీత దర్శకుడు అనిరుధ్, సినిమాటోగ్రాఫర్ రత్నవేలు, ప్రొడక్షన్ డిజైనర్ సాబూ సిరిల్, వీఎఫ్ఎక్స్ అందించిన యుగంధర్, ఎడిటర్ శ్రీకర్ ప్రసాద్.. ఇలా సినిమాని అద్భుతంగా మలిచిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు. చిత్రాన్ని ప్రదర్శించిన పంపిణీదారులు, థియేటర్ యాజమాన్యాలు, నాపై ప్రేమ కురిపించిన సినీ పరిశ్రమ మిత్రులు, సినిమాని ప్రోత్సహించిన మీడియా, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రేక్షకుల దేవుళ్లకు ధన్యవాదాలు. నా కుటుంబ సభ్యులలాంటి అభిమానులందరికీ.. గత నెల నుంచి 'దేవర' సినిమాని ఓ పండగలా జరుపుకొంటున్నందుకు శిరస్సు వంచి ధన్యవాదాలు చెబుతున్నా. మీ అభిమానమే నన్ను ఈ స్థాయికి చేర్చింది. మీరెప్పుడూ గర్వపడే సినిమాలు చేస్తూ ఉండటానికి శాయశక్తులా ప్రయత్నిస్తా. 'దేవర'ని మీ భుజాలపై మోసి, ఇంతటి ఘన విజయం అందించినందుకు థాంక్స్' అని ఎన్టీఆర్ పేర్కొన్నారు.



# ట్రైలర్‌తోనే మైండ్ బ్లాక్ చేసేసింది



సమంత సినిమా వచ్చి చాలా కాలమైపోయింది. చివరగా 'ఖుషి' మూవీ చేసింది. అనారోగ్య సమస్యల కారణంగా యాక్టింగ్ కొన్నాళ్లు పక్కనబెట్టేసింది. కొత్త మూవీస్ కూడా పెద్దగా ఒప్పుకోలేదు. 'ఫ్యామిలీ మ్యాన్' సిరీస్ తీసిన దర్శకులు.. 'సిటాడెల్: హనీ-బన్నీ' పేరుతో ఓ సిరీస్ తీస్తున్నారు. ఇందులో సమంత, బాలీవుడ్ హీరో వరుణ్ ధావన్ లీడ్ రోల్స్ చేశారు. ఇప్పుడు ఈ చిత్ర ట్రైలర్ రిలీజ్ చేశారు. ట్రైలర్ చూస్తే సిరీస్ అంతా ఫుల్ యాక్షన్ ఉండటం గ్యారంటీ అనిపిస్తుంది. ఇందులో సమంత ఓ సీక్రెట్ ఏజెంట్. ఈమెకు ఓ కూతురు కూడా ఉంటుంది. మరోవైపు వరుణ్ కూడా సీక్రెట్ ఏజెంట్. వీళ్లిద్దరూ ఎలా కలిశారు? ఏ మిషన్స్ పూర్తి చేశారు అనేదే స్టోరీ అని తెలుస్తోంది. ట్రైలర్‌లోనే ఫుల్ యాక్షన్ దట్టించారు. గన్ ఫైరింగ్, ఫైటింగ్.. ఇలా సమంత అదరగొట్టేసింది. అమెజాన్ ప్రైమ్ ఓటీటీలో నవంబరు 7 నుంచి ఈ సిరీస్ స్ట్రీమింగ్ కానుంది. తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో అందుబాటులోకి రానుంది. ట్రైలర్‌తోనే బజ్ వచ్చిందంటే మాత్రం సిరీస్‌పై కచ్చితంగా ఆసక్తి పెరుగుతుంది. సమంత కొత్త ట్రైలర్‌పై మీరు ఓ లుక్కేసేయండి.

Printed, Published and Owned by Adula Thirupathi, Printed at Ramani Web Offset Printers, H.No 882/11/1, Auto Nagar, Bommakal Road, Village, mdl & Dist : Karimnagar 505001,Telangana State, Published from 2523, Mudhiraj street, Vemulawada Town, mandal, Siricilla Dist, (Karimnagar Dist) 505302,Telangana State. Editor: Adula Thirupathi. Email: prajanaava@gmail.com. Phone No: 99484 33277. RNI NO: TELTEL/2023/87657